RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -84 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 7 ఏప్రిల్ 2026

# భూమినే జలాశయంగా మార్చుకోవాలి

## యాడికి ' జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- నీరు ఉంటే... సంపద ఉన్నట్లే
- జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్
- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
- నీటి భద్రత..సాగునీటి సంఘాల బాధ్యత యాప్ లాంచ్
- అమరావతికి చట్టబద్ధతపై సీమ ప్రజల హర్షం
- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం




**అనంతపురం,ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**
బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మిగతా 2లో...



## ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి

### గెజిట్ విడుదల చేసిన కేంద్రం


- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత
- కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ
- 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడి


2లో.

## ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

- ఇరాన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవచ్చు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఇరాన్‌లో చిక్కుకున్న రెండో అమెరికా పైలట్‌ను రక్షించిన సైన్యం
- 155 విమానాలతో చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ నిర్వహణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఒక్క రాత్రిలోనే ఇరాన్ దేశాన్ని పూర్తిగా తుడిచిపెట్టగలమని, ఆ రాత్రి రేపే కావచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో కూలిపోయిన అమెరికా ఎఫ్–15 విమాన సిబ్బందిలో రెండో వ్యక్తిని మిగతా 2లో...



## పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్

- మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్
- ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయి ప్రాముఖ్యతను వివరించిన పవన్




2లో.

## నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

- రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం
- గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు
- ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి
- పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చన్న

**శ్రీకాకుళం,ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**
శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మిగతా 2లో...





## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

- భూమి నుంచి రికార్డు దూరంలో
- 1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం
- 10న పసిఫిక్ మహాసముద్రంలో
- ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు

2లో.

## ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

మధురై కోర్టు సంచలన తీర్పు

సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు


2లో.

# హామీలు నెరవేరుస్తున్నాం

## రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

- మేం పాలకులం కాదు..ప్రజా సేవకులం
- ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం
- ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే

: పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**ఆదిలాబాద్ ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**
రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన–ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారుమిగతా 2లో...

## సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు

జెఎన్టీ టియూ స్నాతకోత్సవంలో గవర్నర్



# భూమినే జలాశయంగా మార్చుకోవాలి









మొదటిపేజీ తరువాయి

మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిందని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్

**ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ చేసిన కృషి ఫలించింది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం స్టేషన్‌ను చేర్చుతూ రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో పిఠాపురం స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

కొద్ది నెలల క్రితం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆవశ్యకతను ఆయనకు సమగ్రంగా వివరించారు. పురాణ ప్రాధాన్యం ఉన్న పిఠాపురం పట్టణానికి దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ నొక్కిచెప్పారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిజానికి, పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో పిఠాపురంలో పర్యటించినప్పుడు ఆయన క్షేత్రస్థాయిలో స్టేషన్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, దుర్గంధం వెదజల్లడం గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఆనాడే స్టేషన్ రూపురేఖలు మార్చాలని ఆయన నిశ్చయించుకున్నారు.

పవన్ కల్యాణ్ అభ్యర్థన పట్ల కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో, ఇక పిఠాపురం స్టేషన్ సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. ఈ నిధులతో స్టేషన్ ప్రధాన భవనం, ముఖద్వారం నిర్మాణం, ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, కొత్త షెల్టర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గది, అత్యాధునిక టాయిలెట్లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్ పనులను కూడా పూర్తి చేయనున్నారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. తాను అడిగిన వెంటనే పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, తక్షణం స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కూడా పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## హామీలు నెరవేరుస్తున్నాం

.మొదటిపేజీ తరువాయి



పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

**భూమి నుంచి రికార్డు దూరంలో**

**1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం**

**10న పసిఫిక్ మహాసముద్రంలో**

**ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు**

**న్యూయార్క్**: అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం.ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.



## ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి... గెజిట్ విడుదల చేసిన కేంద్రం

**ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత ఏర్పడింది. అమరావతిని ఏపీ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నేడు అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించినట్లయింది.ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అమరావతి రాజధాని సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పార్లమెంటుకు పంపిన విషయం తెలిసిందే. అక్కడ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయడంతో, దీనికి అధికారిక ముద్ర పడింది. ఈ ప్రక్రియలన్నీ పూర్తవడంతో కేంద్ర న్యాయశాఖ తుది నోటిఫికేషన్ జారీ చేసింది.

2014 నాటి సీఆర్డీయే చట్టంలో పొందుపరిచిన అమరావతిని రాజధానిగా నోటిఫై చేస్తున్నట్లు ఇందులో స్పష్టం చేసింది. ఈ సవరణ చట్టం 2024 జూన్ 2వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లుగా (retrospective effect) గెజిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 5, సబ్-సెక్షన్ (2)లో ఉన్న "కొత్త రాజధాని ఉంటుంది" (a new capital) అనే పదబంధం స్థానంలో "అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది" (Amaravati shall be the new capital) అని మార్పు చేశారు.ఈ సవరణ ద్వారా 'అమరావతి' అనే పదానికి కూడా చట్టంలో స్పష్టత ఇచ్చారు. 'అమరావతి' అనగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (జ=ణూ) చట్టం, 2014 నిబంధనల ప్రకారం నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలు అని వివరణ జోడించారు. రాష్ట్రపతి ఆమోదం, గెజిట్ ప్రచురణతో ఈ చట్ట సవరణ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చినట్లయింది.

## ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

మొదటిపేజీ తరువాయి

విజయవంతంగా రక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌ను 'దుష్టశక్తి'గా అభివర్ణించిన ట్రంప్, ఆ దేశ పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామంటూ గతంలో సోషల్ మీడియాలో చేసిన హెచ్చరికలను పునరుద్ఘాటించారు.ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను 'చారిత్రాత్మకం'గా అభివర్ణించిన ట్రంప్, అమెరికా సైన్యం ఏ ఒక్క అమెరికన్‌ను వెనుక వదిలిపెట్టదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 155 విమానాలు పాల్గొన్నాయని, వాటిలో 4 బాంబర్లు, 64 ఫైటర్ జెట్లు, 48 రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, 13 రెస్క్యూ విమానాలు ఉన్నాయని వివరించారు. వేలాది మంది ఇరాన్ సైనికులు గాలిస్తుండగా, వారిని తప్పుదోవ పట్టించేందుకు సైనికుడు వేరే ప్రాంతంలో ఉన్నాడనే భ్రమ కల్పించి ఈ ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. దాదాపు 48 గంటల పాటు ఇరాన్ దళాలకు చిక్కకుండా ఆ 'వీర సైనికుడు' తప్పించుకు తిరిగాడని ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, రక్తం కారుతున్నా ఆ సైనికుడు కొండచరియలు ఎక్కి తన లొకేషన్‌ను చేరవేశాడని ట్రంప్ చెప్పారు. ఆపరేషన్ అనంతరం వెనుక వదిలేసిన తమ విమానాల్లోని సాంకేతికత ఇరాన్‌కు చిక్కకుండా ఉండేందుకు, వాటిని పూర్తిగా పేల్చివేసినట్టు ట్రంప్ వెల్లడించారు.

అయితే, ఈ రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని కొన్ని మీడియా సంస్థలు ముందుగానే లీక్ చేయడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీక్ వల్ల అమెరికా సైనికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. "ఇది చాలా దారుణం. ఈ లీక్‌కు కారణమైన వ్యక్తిని మేం కచ్చితంగా పట్టుకుంటాం. వార్తను ప్రచురించిన మీడియా సంస్థ వద్దకు వెళ్లి, జాతీయ భద్రత దృష్ట్యా సోర్స్‌ను అప్పగించమని కోరతాం, లేదంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది" అని ట్రంప్ నేరుగా హెచ్చరించారు.

## ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష... మధురై కోర్టు సంచలన తీర్పు

**మధురై ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**



దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు.కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్-19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి. పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

## నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

మొదటిపేజీ తరువాయి




మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్టులలో బోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్తులు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎంఎ÷-లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# నంద్యాల జిల్లా వ్యాప్తంగా బిజెపి జెండా రెపరెపలాడాలి

**-జిల్లా వ్యాప్తంగా బీజేపీ జెండా ఆవిష్కరణలు. -నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 06:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లాలో సోమవారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 100కు పైగా ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరగగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు కీలక పాత్ర పోషిస్తూ విస్తృతంగా పాల్గొన్నారు.




ఉదయం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి విగ్రహానికి పూలమాలలు అర్పించిన అనంతరం అభిరుచి మధు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యాళ్లూరు గ్రామంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అభిరుచి మధు ప్రముఖంగా పాల్గొని పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచారు. గోసుపాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామంలో ఎర్వ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బెక్కం నాగేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు మధుగోపాల్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్థులు హాజరయ్యారు.

అలాగే బీవీ నగర్ గ్రామంలో జెండా ఆవిష్కరించిన అభిరుచి మధు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మురళి, వేణు, నాగేశ్వరావు, మండల నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం రాయపాడు, గోసుపాడు, జూలేపల్లి గ్రామాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించబడగా, అన్ని చోట్లా అభిరుచి మధు చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేశారు. జిల్లాలో విస్తృత స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు పార్టీ శక్తిని చాటిచెప్పాయని నాయకులు పేర్కొన్నారు.







# కొత్తూరు సుబ్బరాయునిలో తిరుపతి డిఎస్పీ పూజలు..!

**..ఆలయ ప్రధానార్చకులు కంపమల్ల సురేష్ శర్మ.**

**-ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.**



**ఆంధ్ర ప్రగతి పాణ్యం ఏప్రిల్ 05:** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసి యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము నందు తిరుపతి పోలీస్ ప్రైమరీ ట్రైనర్ (పిటిసి) డిఎస్పి రాజగోపాల్ రెడ్డి సతీ సమేతంగా ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, వీరయ్య స్వామి ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు శేష వస్త్రములు, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రసాదం అందజేశారు.

**..ఆలయ అభివృద్ధికి, అన్నదానమునకు 45 వేలు విరాళం..!**

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానమునకు అభివృద్ధి నిమిత్తం భక్తులు నలబై ఐదు వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. గోస్పాడు మండలం యాళ్ళూరు కు చెందిన మణిదీప్ రెడ్డి 25,000-/, కానాల పల్లె గ్రామానికి చెందిన భూపతి నాగశేష లలిత సరస్వతి 10,516-/లు, కోవెలకుంట్ల పట్టణమునకు చెందిన దొంతి రెడ్డి శంకర్ రెడ్డి ఉమాదేవి 10,116-/లు విరాళంగా సమర్పించారు, వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ సుంకులమ్మ దేవాలయం హుండీ లెక్కింపు

**ఈ సంవత్సరం నూతన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం**

**: ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.**

**హుండీ ఆదాయం రెండు లక్షల ముప్పై ఆరు వేల అరవై రూపాయలు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 05:** నంద్యాల సుంకులమ్మ వీధిలో ఉన్న శ్రీ సుంకులా పరమేశ్వరీ దేవస్థానం హుండీ లెక్కింపు ఆదివారం నిర్వహించారు. దేవాలయం కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ హుండీ తెరిచి లెక్కింపు ప్రారంభించారు. హుండీ లెక్కింపు ముగిసిన తర్వాత చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి చిమ్మా నాగన్న మాట్లాడుతూ హుండీ ఆదాయం రెండు లక్షల ముప్పై ఆరు వేల అరవై రూపాయలు వచ్చిందని, దేవస్థానం బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఉగాది,కార్తీక మాసం,శివరాత్రి ప్రత్యేక పూజలు,శ్రీరామనవమి రోజు సీతారామ కళ్యాణం మరియు గ్రామోత్సవం నిర్వహించామన్నారు. భవిష్యత్తులో నంద్యాల పట్టణంలోని సుంకులమ్మ భక్తుల సహాయ సహకారాలతో నూతన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో కార్యదర్శి చిమ్మా నాగన్న,ఉపాధ్యక్షులు గోపిశెట్టి వెంకట ప్రసాద్,యంచర్ల నరసింహారావు,సంయుక్త కార్యదర్శి బైగ్గారి మురళి, కోశాధికారి బైగ్గారి చిన్న ప్రసాద్, కార్యవర్గ సభ్యులు బైగ్గారి నాగ మనోజ్, బైగ్గారి సురేష్,ఓజా ప్రసాద్,ఓజా హరి,ఎం.ప్రతాప్ పాల్గొన్నారు.

# 100 రోజుల కార్యాచరణతో భూగర్భ జలాల పెంపుదలపై దృష్టి.

**నీటి ఎద్దడి నివారణకు జలధారజలహారతి కీలకం. -రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 06:** రాష్ట్రంలో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జలధారజలహారతి" కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామంలో నిర్వహించిన "జలధార నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికగా కొనసాగుతుందని తెలిపారు. చెరువులు నింపడం, ఫీడర్ ఛానల్స్ మరియు వాగుల డీసిల్టింగ్ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాణ్యం మండలంలో నీటి ఎద్దడి సమస్య ఉన్నప్పటికీ, సిమెంట్ నగర్ ప్రాంతం పైభాగంలో కురిసే వర్షపు నీరు కిందకు చేరి చెరువులను నింపుతుందని వివరించారు. ఈ నీటి వనరులపై తాగునీటి అవసరాలు మాత్రమే కాకుండా పశువులు, పక్షులు కూడా ఆధారపడుతున్నాయని తెలిపారు. గతంలో వర్షాధారంగా మాత్రమే చెరువులు నిండేవని, ప్రస్తుతం నీటి నిర్వహణ చర్యల వల్ల ఆ ప్రాంతాలు సస్యశ్యామలంగా మారి మూడు పంటలు పండుతున్నాయని, గ్రామాల అభివృద్ధి గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ భూగర్భ జలాల మట్టం ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా పాపిలి మండలంలో 20 మీటర్లకు పైగా లోతులో నీరు ఉండగా, 8 నుంచి 20 మీటర్ల మధ్య నీటి మట్టం ఉన్న మండలాలు తొమ్మిది ఉన్నాయని తెలిపారు. మొత్తం 165 గ్రామాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. గత 10 సంవత్సరాల హైడ్రోగ్రాఫిక్ విశ్లేషణ ఆధారంగా నీటి కొరత ఉన్న గ్రామాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థాయిని నిరంతరం పరిశీలిస్తూ శాస్త్రీయ విధానంలో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని స్పష్టం చేస్తూ, ప్రజలు, రైతులు, వాటర్ యూజర్ అసోసియేషన్లు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భూగర్భ జలాల మట్టాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన "3 మీటర్లు 8 మీటర్ల కాన్సెప్ట్" ప్రకారం, వర్షాకాలం అనంతరం భూగర్భ జలాల మట్టం 3 మీటర్లకు పైగా ఉండేలా, ఎండాకాలంలో 8 మీటర్ల కంటే దిగువకు పడిపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# తిమ్మాపురం గ్రామంలో ఘనంగా బీజేపీ ఆవిర్భావం వేడుకలు.

**ఆంధ్ర ప్రగతి మహానంది, ఏప్రిల్ 06:** బీజేపీ అధికారంలో ఉంటే భారతదేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు కేఈ కిరణ్ కుమార్ గౌడ్ తెలిపారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో బీజేపీ పార్టీ 46 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. భారతదేశంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామి దేశంగా ప్రగతి పథంలో ముందుకు తీసుకెళుతుంది అన్నారు. వికసిత్ భారత్, సుపరిపాలన లక్ష్యంగా నేడు దేశంలో పరిపాలన కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు,టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎర్రగుంట్ల బాబు, మాజీ ఎంపీపీ దొంత సుబ్రహ్మణ్యం,జనసేన నాయకులు , చక్రపాణి,జంగం మహేశ్వరయ్య,దుర్గాప్రసాద్, బిజెపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదులను విచారణ జరిపి.. చట్ట పరిదిలో న్యాయం చేస్తాం.!

**ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ.**

**..జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఏప్రిల్ 06:** నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 80 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ గారు స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు



పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. 1).25-03-26 తేదీన నంద్యాల నుండి అనంతపురం వెళ్ళుటకు నంద్యాలలో బస్సులు ఎక్కడం జరిగింది. బస్సులో ఎక్కువ రద్దీ ఉండడంతో బంగారు నగలతో ఉన్న బ్యాగు డ్రైవర్ వెనక సీట్ లో కూర్చున్న ఇద్దరు మహిళలు ఇవ్వడం జరిగింది. కొన్ని నిమిషాల్లో మేము వెంటనే వాటిని తీసుకున్నాము. కానీ మేము ధర్మవరం వెళ్లి చూడగా బ్యాగ్ లోని పర్సులో బంగారం నగలు కనపడటం లేదు కావున పోయిన మా బంగారు నగలని కనిపెట్టి మాకు న్యాయం చేయాలని నంద్యాల పట్టణానికి చెందిన సాయి చైతన్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

2).నాకు ఉద్యోగం ఇప్పిస్తానని నా వద్ద నుండి రెండు లక్షల రూపాయలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన బెంగళూరు జాబ్ కన్సల్టెన్సీ కి చెందిన బుక్కి సేవల నాయక్ పై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండని నంద్యాల టౌన్ జ్ఞానాపురం కు చెందిన లావణ్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 3).నేను 2024లో కొండారెడ్డి అను వ్యక్తి దగ్గర నుండి 25 లక్షలకు వరుకోత మిషన్ కొన్నాను దానికి సంబంధించిన స్పేర్ సామాన్లు ఇంతవరకు ఇవ్వలేదు. ఎక్కువగా రిపేర్లు వస్తుందని చెప్పినా స్పందించడం లేదని నాకు న్యాయం చేయండని నెహ్రూ నగర్ కు చెందిన వంశీ కుమార్ రెడ్డి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# ఉచిత మంచినీటి పంపిణీని కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 06:** నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి పంపిణీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఈరోజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మంత్రి ఫరూక్ రిబ్బన్ కట్ చేసి ఈ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ, ఎండల తీవ్రత దృష్ట్యా మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులు, కూలీలు మరియు సామాన్య ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చైర్మన్ గుంటుపల్లి హరిబాబును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ వేసవి కాలం ముగిసే వరకు ఈ ఉచిత మంచినీటి సౌకర్యం నిరంతరాయంగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రంగ ప్రసాద్, మార్కెట్ యార్డ్ పాలక మండలి సభ్యులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందించడం అభినందనీయం.

### -.మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 06:**నంద్యాల పట్టణంలో సునీల్ హెల్పింగ్ గ్రూప్ సొసైటీ (ఎస్. హెచ్. జి. ఎస్) ప్రెసిడెంట్ సునీల్ కుమార్ మరియు 36 వార్డ్ టీడీపీ ఇంచార్జ్ మరుతి ప్రసాద్ ఆధ్వర్యంలో నంద్యాల రైతు బజార్ నందు ఏర్పాటు చేసిన కూరగాయలు మరియు నిత్యవసర వస్తువుల స్టాల్స్ ప్రారంభోత్సవం సందర్భంగా, సొసైటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని వారి నంద్యాల క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రైతుల నుంచి నేరుగా తాజా కూరగాయలను కొనుగోలు చేసి, పట్టణ ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన, కల్తీ లేని వస్తువులను అందించాలనే సొసైటీ నిర్ణయం మరియు ప్రతి కొనుగోలు వస్తువులపై బహుమతులు అందించడం ఎంతో సాహసోపేతమైనది మరియు ప్రశంసనీయమైనదని తెలిపారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఈ స్టాల్స్‌ను నిర్వహించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ నాణ్యమైన కూరగాయలను అందించేందుకు కృషి చేస్తున్న సునీల్ హెల్పింగ్ గ్రూప్ సొసైటీ ప్రయత్నానికి పట్టణ ప్రజలందరూ తమ మద్దతు తెలపాలని మంత్రి ఫరూక్ కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్ హెల్పింగ్ గ్రూప్ సొసైటీ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, 36వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి ప్రసాద్,మార్క్ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తులసి రెడ్డి, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మాజీ కౌన్సిలర్ నాగార్జున, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సుమలత , స్వామి నాయక్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమైక్య జనరల్ సెక్రటరీ సుధీర్, చంటి, సొసైటీ కార్యవర్గం వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ట్రెజరర్ శివచంద్రుడు, చంద్ర బోస్ , సతీష్, రఘునాథ్ రెడ్డి , వెంకట రమణయ్య, సాయిరాం, మరియు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 06:**నంద్యాల పట్టణ అభివృద్ధిలో భాగంగా 9వ వార్డు పరిధిలోని గుడిపాటి గడ్డలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం భూమి పూజ నిర్వహించారు.

9 వార్డ్ టీడీపీ ఇంచార్జి చెన్నం శెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. పట్టణంలోని ప్రతి గల్లీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాలను గుర్తించి వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న 9 వార్డ్ టీడీపీ ఇంచార్జి చెన్నం శెట్టి శ్రీనివాసులును ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ అభినందించారు.వార్డు ఇంచార్జి చెన్నం శెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక ప్రజల విన్నపం మేరకు మంత్రి ఫరూక్ సహకారంతో ఈ సీసీ రోడ్డు పనులను చేపట్టడం జరిగిందని, వార్డులో ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను మంత్రి ఫరూక్ గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామిని మల్లికార్జున, బోయ రామకృష్ణ, ఉప్పరి సురేష్, మిడత వెంకటేశ్వర్లు, సింహాద్రి సురేష్ బాబు, పెద్ది మురళి, పి వై రామాంజనేయులు, మచ్చ సురేష్, మహబూబ్, పత్తి సుబ్బయ్య, సంఘ బ్రహ్మం, గొల్ల శంకర్, సద్దాం హుస్సేన్, మాజీ కౌన్సిలర్ దేవరపాటి రవికుమార్, చలం బాబు, ఎల్లత్తల శ్రీనివాసులు, సంఘ రమణ, సంఘ జయంతి, తులసి, నీరజ, ప్రవళిక, నసీమా స్థానిక నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు మరియు వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.

### నంద్యాల మార్కెట్ యార్డ్ జనరల్ బాడీ సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 06:**నంద్యాల మార్కెట్ యార్డ్ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మార్కెట్ యార్డులను మళ్లీ పూర్వవైభవానికి తీసుకువస్తామని, పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో యార్డ్ కమిటీలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. యార్డులో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, దళారీల ప్రమేయం లేకుండా చూడాలని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ మంత్రి ఫరూక్ సహకారంతో నంద్యాల యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ పాలకమండలి సభ్యులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

# అమరావతి చట్టబద్ధతపై వేడుకలు

**మంత్రి ఫరూక్ ముఖ్యఅతిథిగా కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.**

**అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది : మంత్రి ఫరూక్.**

**అమరావతి రాజధాని చట్ట బద్ధత పై హర్షం వ్యక్తం చేసిన చిన్న, వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం.**

**వీధి వ్యాపారస్తుల సంక్షేమానికి, వారి జీవనోపాధి సంరక్షణకు సహకరిస్తాం: మంత్రి ఫరూక్**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 05:**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి కి పార్లమెంటులో చట్టబద్ధత చేసిన సందర్భంగా నంద్యాల జిల్లా వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎమ్.డి. ఫరూక్ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.మంత్రి ఫరూక్ కేక్ కట్ చేశారు. విధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం తరపున మంత్రి ఫరూక్ ను సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు మహబూబ్ బాషా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజా రాజధానిగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తెలుగు ప్రజలు గర్వించే స్థాయిలో కూటమి ప్రభుత్వం నిర్మిస్తుందని, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి వేగవంతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథంలో తీసుకువెళు న్నారని అన్నారు.

నంద్యాల జిల్లా వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అనుకూలమైన ప్రదేశంలో అమరావతి మహా నగరాన్ని నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూనుకోవడం ఆయన దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అమరావతి రాజధానికి మద్దతు పలుకుతూ హర్షం వ్యక్తం చేస్తున్నదని తెలిపారు.

జిల్లా వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా, కార్యదర్శి చిన్న మాతంగి ఉమా మహేష్ తదితరులు మాట్లాడుతూ అమరావతి రాజధానిగా చట్టబద్ధత కోసం సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి, కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యామంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.

వీధి వ్యాపారస్తుల సంక్షేమానికి ,వారి జీవనోపాధి సంరక్షణకు సహకరిస్తాం: మంత్రి ఫరూక్.

ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం తరపున కేంద్ర వీధి వ్యాపారస్తుల జీవనోపాధి సంరక్షణ చట్టం 2014" అనుగుణంగా వీధి వ్యాపారుల సంక్షేమానికి సహకరించాలని మంత్రి ఫరూక్ కు వినతిపత్రం సమర్పించారు. మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే కేంద్ర చట్టం



అనుగుణంగా టౌన్ వెండింగ్ కమిటీని ఏర్పాటు చేసి వీధి వ్యాపారస్తుల జీవనోపాధి సంరక్షణ కోసం, వారి సంక్షేమం కోసం సహకరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు మద్దినేని వెంకటరమణ, అజీజ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి చిన్న మాతంగి ఉమా మహేష్, కోశాధికారి అలీమ్, సంయుక్త కార్యదర్శి షేక్ ఖాజా హుస్సేన్, పిచ్చుక లోకేష్, అధిక సంఖ్యలో వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# రైతు కు ఇచ్చే సబ్సిడీలు, మహిళా రుణాలపై ఆరా.

**మార్కెట్ యార్డ్ షాపులను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి. -టెక్కె ప్రాంతంలో మంత్రి ఫరూక్ ఆకస్మిక తనిఖీ.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 06:**

నంద్యాల పట్టణంలోని టెక్కె ప్రాంతంలో ఉన్న వివిధ సహకార సంస్థలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శిల్పా సూపర్ మార్కెట్, శిల్పా మహిళా సహకార్, శిల్పా రైతు సమాఖ్య మరియు నంది రైతు సమాఖ్యలను నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ స్వయంగా తనిఖీ చేశారు. మంత్రి ఫరూక్ షాపులన్నింటినీ కలియతిరుగుతూ, రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, మహిళలకు మంజూరు చేస్తున్న రుణాలు మరియు సామాన్య ప్రజలకు నిత్యవసర సరుకులపై ఇస్తున్న డిస్కౌంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ షాపుల లీజు గడువు ముగిసినందున, వాటిని నిర్వహిస్తున్న వారు వెంటనే మార్కెట్ యార్డ్‌కు షాపులను అప్పగించాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. "ప్రస్తుతం ఒక్కో షాపుకు కేవలం రూ. 2,700 మాత్రమే అద్దె చెల్లిస్తున్నారు, ఇది వాస్తవ మార్కెట్ ధర కంటే చాలా తక్కువ. ఇదే ప్రాంతంలో ఎదురుగా ఉన్న షాపుల అద్దె రూ. 15,000 నుండి రూ. 20,000 వరకు ఉందని . ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ఉండేందుకు వీటిని వెంటనే హ్యాండోవర్ చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్ యార్డ్ ఆస్తులను సక్రమంగా వినియోగించుకోవాలని, లీజుదారులు సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సూచించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగపడాలని . టెక్కె ప్రాంతంలోని ఈ షాపుల లీజు గడువు ఎప్పుడో ముగిసిపోయిందని . ప్రస్తుతం ఇక్కడ ఒక్కో షాపుకు కేవలం ₹2,700 మాత్రమే అద్దె చెల్లిస్తుండటం గమనార్హం అన్నారు. సరిగ్గా వీటికి ఎదురుగా ఉన్న ప్రైవేటు షాపుల బాడుగలు ₹15,000 నుండి ₹20,000 వరకు పలుకుతున్నాయిని . ఇలాంటి పరిస్థితుల్లో అతి తక్కువ అద్దెకు ప్రభుత్వ షాపులను కొనసాగించడం వల్ల మార్కెట్ యార్డ్ ఆదాయానికి భారీగా గండి పడుతోందని తెలిపారు . కాబట్టి, లీజుదారులు వెంటనే స్పందించి ఈ షాపులను మార్కెట్ యార్డ్ అధికారులకు హ్యాండోవర్ చేయాలని. అదేవిధంగా, రైతులకు ఇచ్చే సబ్సిడీలు, మహిళలకు అందే రుణాలు మరియు ప్రజలకు నిత్యవసర వస్తువులపై ఇచ్చే రాయితీలు క్షేత్రస్థాయిలో అర్హులకు సక్రమంగా అందుతున్నాయో లేదో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రంగ ప్రసాద్, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సుడిగాలి పర్యటనలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 06:**

నంద్యాల పార్లమెంట్ పరిధిలోని నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాలలోని జూపాడుబంగ్లా, కొత్తపల్లి, కల్లూరు, పాములపాడు మండలాలలో ఎంపీ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, మినరల్ వాటర్ ఫ్లాంట్ల ప్రారంభోత్సవంలు, శంఖుస్థాపణలు, కల్లూరు మండలంలో పేద ముస్లిం రెండు వేల మంది మహిళలకు చీరెలు పంపిణీ, రాయలసీమలోని జాతరలలో ప్రముఖమైన తర్తూరు శ్రీ రంగనాథస్వామి తిరునాళ్లలో పాల్గొని స్వామి వార్ల దర్శనం,

తర్తూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు ప్రారంభం సోమవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి విస్తృతంగా, సుడిగాలి పర్యటన చేశారు.

జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలో వంక నుంచి పాత రంగస్వామి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం, బైరెడ్డి బిల్డింగ్ లలో రెండు సిమెంట్ రోడ్లల నిర్మాణాలకు ఎన్ ఆర్ జి ఎస్ నిధులు రూ. 55 లక్షలతో ఖర్చు చేసి పూర్తి చేయడంతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. పాఠశాల కు వెళ్లి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ భవనం శిధిలావస్థాకు చేరుకుందని చెప్పడంతో అక్కడి నుంచే నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి కి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఫోన్ చేసి తర్తూరు స్కూల్ సమస్య పరిష్కారం చేయాలన్నారు. గ్రామం లోని రెండు అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తర్తూరు శ్రీ రంగనాథ్ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి



పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి వారికి అర్చన, విశేష పూజలు చేయించి ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదం అందించి శాలువతో సన్మానం చేసి ఆశీర్వచనం చేశారు. తర్తూరు టీడీపీ నాయకులు పి. నాగిరెడ్డి, శివ కృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరావు, బంగారు వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.జూపాడుబంగ్లా మండలం భాస్కాపురం గ్రామంలోని బి సి కాలనీలో రూ. 25 లక్షలు, ఎస్సీ కాలనీలో రూ. 25 లక్షలు మొత్తం రూ. 50 లక్షల ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మాణం పూర్తి చేసి సోమవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు గోవింద్ యాదవ్, మాధవి, పరమేష్, నరసింహ, శివమ్మ, అనిల్, శ్రీరాములు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఘన స్వాగతం పలికారు.పాములపాడు మండలం వాడాల గ్రామంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మాణం పూర్తి చేసిన మినరల్ వాటర్ ఫ్లాంట్ ను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు ప్రతాప్ రెడ్డి స్వామిరెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు మా వాడాల గ్రామ రైతుల కోసం కేసీ కానాల్ కు వంతెనలు నిర్మాణం చేయాలని, తెలుగుగంగ ఆధునీకరణలో భాగంగా మూడు తూములు తెగిపోవడం వల్ల అవతల ఆయకట్టు పొలాలకు నీరులేక ఇబ్బంది పడుతున్నామని వాటిని ఏర్పాటు చేయించాలని, వికలాంగుల సమస్యలు కూడా పరిష్కరించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దృష్టికి తెచ్చారు. మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కొత్తపల్లి మండలం నల్లమల అరణ్యంలోని పెద్ద గుమ్మాడాపురం గ్రామంలో ఉన్న బి సి కాలనీ ప్రజల విన్నపం మేరకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ఫ్లాంట్ ను సోమవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. అటవీ సమీపంలో ఉన్న ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకే ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ఫ్లాంట్ మంజూరు చేశామని, ప్రజల ఆరోగ్యం చాలా ముఖ్యమని, మీ వినతులు పరిష్కరిస్తానని ప్రజల నుంచి అర్జీలు తీసుకొని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గ్రామ నాయకులు నాగశేషన్న యాదవ్, గంగన్న, మండలం టీడీపీ నాయకులు శ్రీనాథ్ రెడ్డి, శివారెడ్డి, చిన్న పుల్లారెడ్డి, రఘురామిరెడ్డి, కాంట్రాక్టర్ జగన్ రెడ్డి తదితరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి ఘన స్వాగతం పలికి గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ప్రభుత్వ భూములను పార్టీ కార్యాలయాలకు ధారాదత్తం చేస్తారా.?

**లీజుల పేరుతో ఆక్రమణలు సాగిస్తే సహించం. -సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ధ్వజం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 06:** రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు ప్రజా ప్రయోజనాల కోసం ఉన్న ప్రభుత్వ భూములను పార్టీ కార్యాలయాల పేరుతో లీజులకు తీసుకోవడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ లు విమర్శించారు. సోమవారం సాయిబాబా నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

నంద్యాల జిల్లా ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న తరుణంలో, గతంలో నంద్యాల పట్టణం నూనెపల్లెలో ఉన్న వ్యవసాయ పరిశోధన భూములను కలెక్టర్ కార్యాలయానికి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల కోసం తీసుకుంటే ప్రశ్నించిన ఫరూక్.. నేడు ఆయన అదే ధోరణిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. నాడు ప్రతిపక్ష నేతగా ప్రశ్నించిన ఫరూక్, నేడు అధికారంలోకి రాగానే నంద్యాల జిల్లా కేంద్రంలోని నంద్యాల పట్టణం, నూనెపల్లె మార్కెట్ యార్డుకు చెందిన కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కేవలం అధికార పార్టీ తీసుకోవడం




దుర్మార్గమన్నారు. మార్కెట్ యార్డుకు చెందిన రెండెకరాల భూమిని ఏడాదికి కేవలం వెయ్యి రూపాయల లీజుతో టీడీపీ జిల్లా కార్యాలయం కోసం తీసుకోవడంపై వారు ధ్వజమెత్తారు. గతంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డిని విమర్శించిన మీరు, ఈరోజు అదే బాటలో ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఈ విషయం మీద ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం కోసం అర్జీలు పెట్టినా స్పందించని అధికారులు, అధికార పార్టీ కార్యాలయానికి అంటేనే జిఓ తీసుకువచ్చి నూనెపల్లెలోని మార్కెట్ యార్డు భూములను తీసుకోవడం దుర్మార్గమని వారు ఆరోపించారు. మార్కెట్ యార్డ్ భూములకు సంబంధించి గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన రైతు ఇప్పటికే కోర్టును ఆశ్రయించారని, నూనెపల్లె గ్రామానికి చెందిన భూమిని ఎలా తీసుకుంటారని వారు నిలదీశారు. ఇటీవలే చాబోలు, రైతునగరం వంటి గ్రామాల్లోనూ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. పార్టీ కార్యాలయాల కోసం జీఓలు తెచ్చుకోవడంలో ఉన్న ఉత్సాహం పేదల ఇళ్ల స్థలాలపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

టీడీపీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, గత ప్రభుత్వంలో గుర్తించిన వేల మంది ఇళ్లు లేని పేదలను నేటికీ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన 2 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల సాయం ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. గత నెలలో పట్టణ పేదల కోసం మంత్రి ఫరూక్ కార్యాలయాన్ని ముట్టడించామని గుర్తు చేస్తూ, వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేని పక్షంలో నిరుపేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం.

**-.మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**నంద్యాల మార్కెట్ యార్డ్‌లో మిర్చి కొనుగోళ్లను పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**రైతులతో ముఖాముఖి సమస్యల అడిగి తెలుసుకున్న వైనం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 06:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ సోమవారం నంద్యాల మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో మంత్రి ఫరూక్ యార్డ్‌కు వచ్చిన మిర్చి నిల్వలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి సర్కార్, ప్రతి రైతుకూ గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మిర్చి నాణ్యత, ప్రస్తుత మార్కెట్ ధరలు మరియు తూకంలో జరుగుతున్న ప్రక్రియపై రైతులతో ఆయన ముఖాముఖి చర్చించారు. మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను మరియు పాలక మండలిని ఆదేశించారు. మిర్చి రైతులకు మార్కెట్‌లో మంచి ధర లభించేలా యార్డ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. రైతులకు నష్టం చేకూర్చే దళారీ వ్యవస్థపై కఠినంగా వ్యవహరిస్తామని, పారదర్శకమైన వేలం నిర్వహించాలని స్పష్టం చేశారు. సీజన్ దృష్ట్యా రైతుల రద్దీ పెరుగుతున్నందున, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు.

నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ మంత్రి ఫరూక్ సూచనల మేరకు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, నంద్యాల మార్కెట్ యార్డ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఈ పర్యటనలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, అధికారులు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ పరిష్కారంలో నిర్లక్ష్యం.. అధికారులపై కలెక్టర్ అసంతృప్తి.

**412 మందిలో 106 మందికి 'సున్నా' మార్కులు పనితీరుపై తీవ్ర అసంతృప్తి.**

**సీఎం, డిప్యూటీ సీఎం ఎండార్స్ పిటిషన్ల నిర్లక్ష్యం సహించం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 06:** జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారుల పనితీరును సమగ్రంగా విశ్లేషించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 412 మంది అధికారుల పనితీరును ఓపిటిఎస్ ద్వారా అంచనా వేయగా, 106 మంది అధికారులకు గ్రీవెన్స్ పరిష్కారంలో 'సున్నా' మార్కులు రావడం ఆందోళనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సున్నా ర్యాంకింగ్ పొందిన అధికారుల్లో రెవెన్యూ శాఖ (తహసీల్దార్లు, సర్వే అధికారులు), పంచాయతీరాజ్ శాఖ (ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు), వ్యవసాయ శాఖ (అసిస్టెంట్ డైరెక్టర్లు), పోలీస్ శాఖ (ఎస్‌హెచ్ఓలు), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ సూపర్వైజర్లు), హౌసింగ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, అటవీ శాఖ, మార్కెటింగ్/మార్క్‌ఫెడ్, విద్యాశాఖ (ఎంఈఓలు), రూరల్ డెవలప్మెంట్, డిఆర్డిఏ, సర్వే & ల్యాండ్ రికార్డ్స్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారని తెలిపారు.

ప్రత్యేకంగా ఆళ్ళగడ్డ, కొత్తపల్లి, కోయిలకుంట్ల, పాణ్యం, నందికొట్కూరు మండలాలు మరియు పట్టణ ప్రాంతాల్లో కొందరు అధికారుల పనితీరు సంతృప్తికరంగా లేదని సూచించారు. అయితే, కొందరు అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా మంచి పనితీరు కనబరిచారని అభినందించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎండార్స్ చేసిన పిటిషన్లను నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రమైన విషయమని కలెక్టర్ స్పష్టం చేశారు. మొత్తం 35 ముఖ్యమైన అర్జీలు పెండింగ్‌లో ఉంచడం లేదా తప్పుడు కారణాలతో మూసివేయడం గమనించినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్లను తిరిగి ఓపెన్ చేసి, వాటిపై జిల్లా స్థాయిలో ప్రత్యక్ష విచారణ కొనసాగుతోందన్నారు. ఈ 35 పిటిషన్లలో ప్రధానంగా రెవెన్యూ (సిసిఎల్ఏ), దేవాదాయ శాఖ (ఎండోమెంట్స్), అటవీ శాఖ (పిసిసిఎఫ్ పరిధి), విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, ఫ్యామిలీ వెల్ఫేర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రూరల్ డెవలప్మెంట్, పోలీస్ శాఖ, సర్వే శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, వాటర్ రిసోర్సెస్ (ఈఎన్సీ), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదితర శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత ఆర్డీవోలు, ఎండోమెంట్స్ అధికారులు, అటవీ శాఖ అధికారులు పూర్తి వివరాలతో వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించారు.


వికలాంగ బాలుడికి హౌస్ సైట్ మంజూరులో జరిగిన ఆలస్యంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి సున్నితమైన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. దేవాదాయ శాఖలో పిటిషన్ల పరిష్కారం మందగమనంగా ఉందని పేర్కొని, పనితీరు మెరుగుపరచాలని ఆదేశించారు. వచ్చే వారం ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా పిటిషన్లపై సమీక్ష జరగనున్న నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న అన్ని అర్జీలను తక్షణమే పరిష్కరించి 'జీరో పెండెన్సీ' సాధించాలని స్పష్టమైన గడువు విధించారు. మండల, డివిజనల్ స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు. సున్నా పనితీరు కనబరిచిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, పనితీరు మెరుగుపరచని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశించారు. పనితీరు ఆధారంగా అధికారులకు ర్యాంకులు కేటాయిస్తున్నామని, విధుల పట్ల బాధ్యతను పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. వచ్చే వారం అత్యధిక పెండింగ్ మరియు సున్నా పనితీరు కలిగిన 15 మంది అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

# నిర్ణీత గడువులోగా ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి.

**పిజిఆర్ఎస్ ద్వారా 263 దరఖాస్తుల స్వీకరణ.**

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 141 దరఖాస్తుల స్వీకరణ.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి.రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 06:** ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యతనిస్తోందని అందుకు అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధతో అర్జీలను పరిష్కరించాలన్నారు. రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటికి తొలి ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా 263 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 141 అర్జీల స్వీకరణ.**

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 141 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 4, అడంగల్ సవరణలకు సంబంధించినవి 11, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 17, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 12, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 28, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 63, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 6గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు. 1) డోన్ మండలానికి చెందిన రామకృష్ణ రెడ్డి తనకున్న ఎకరా 40 సెంట్ల భూమి ఎన్హెచ్ 340 బి నిర్మాణంలో పోవడం జరిగిందని అందుకు తగిన నష్టపరిహారాన్ని ఇంతవరకు తనకు అందలేదని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించగా సంబంధిత విషయంలో జాప్యం తగదని ఈ వారంలో హియరింగ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని డోన్ ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. 2) పాములపడు గ్రామానికి చెందిన నీలి ఆంజనేయులుకి గతంలో డి పట్టా ఇవ్వడం జరిగిందని, ఆయనకు ఇద్దరూ భార్యలు మొదటి భార్యకు ఒక కుమారుడు, రెండవ భార్యకు ఇద్దరు కుమారులు వీరికి సమానంగా భాగా పంపిణీ చేయాలని కోర్టు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, అయినప్పటికీ మొదటి భార్య కుమారుడు నీలి వెంకటరమణ ఆస్తి మొత్తం తనదని నకిలీ డి పట్టాను సృష్టించుకొని ఇబ్బంది కలుగజేస్తున్నారని రెండవ భార్య కుమారుడు జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించగా సదరు అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పాములపాడు తహశీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు.

# జిల్లాలోని కాలువలు, చెరువులు, ఫీడర్ చానెల్స్ లో నీటి నిల్వ సామర్ధ్యాన్ని పెంచాలి

**వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జల మట్టాలను పెంచాలి.**

**శకునాలమ్మ చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి. -జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 06:** జిల్లాలోని కాలువలు, చెరువులు, ఫీడర్ చానెల్స్ లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం ఓర్వకల్లు మండలం శకునాల గ్రామం మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ వద్ద నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా పూడికతీత పనులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ నీటి చుక్కని సంరక్షించేందుకు రాబోయే 100 రోజులలో తీసుకోవలసిన చర్యలపై ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో గ్రామ, మండలాల వారీగా ఉన్న చెరువులు, కాలువలు, ఫీడర్ చానెల్స్ లను గుర్తించి వాటికి నీటి ప్రవాహం, నీటి నిల్వ సామర్థ్యాన్ని గుర్తించి నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగించడానికి, చెరువులలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు పూడికతీత తదితర పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షపు నీటి పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు ప్రధాన లక్ష్యంగా 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంజీఎన్ఆర్ జిఎస్ కింద శకునాలమ్మ చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. చెరువుకు నీళ్లు వచ్చేలా, దాని పూడిక తీయడం, ఫీడర్ ఛానల్ (వంక)ను శుభ్రం చేసి చెరువుకు నీళ్లు వచ్చేలా పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. చెరువులను పునరుద్ధరించడం ద్వారా నీటి వనరులను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ డీఈ బ్రహ్మానంద రెడ్డి, ఏఈ రియాజ్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 22 ఏ, చుక్కల భూముల సమస్యలకు పరిష్కారం.

**...జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 06:** జిల్లాలో 22 ఏ, చుక్కల భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో 22 ఏ, చుక్కల భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి కర్నూలు రూరల్, వెల్దుర్తి మరియు తుగ్గలి మండలాలకు చెందిన పది మంది రైతులకు కలెక్టర్ ప్రొసీడింగ్స్ ను అందచేశారు. కర్నూలు రూరల్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జె. రామాంజనేయులు, శేషిరెడ్డి, గార్గేయపురం గ్రామ నివాసి నల్లగొట్ల లక్ష్మన్న, వెల్దుర్తి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన దేశపోగు లక్ష్మమ్మ, దేశపోగు ఆంజనేయ, తుగ్గలి మండలానికి చెందిన ఉప్పరి సుబ్బరాయుడు, చంద్రశేఖర్ లకు చెందిన 22 ఏ, చుక్కల భూములకు పరిష్కారం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 22 ఏ, చుక్కల భూముల సమస్యలను పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 22 ఏ సమస్యలకు సంబంధించి ఈ ఏడాది 242 సమస్యలను పరిష్కరించడం జరిగ్9దాని, 32 వేల ఇనాం నుండి పట్టా సమస్యలను పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు.ం

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు.

**...జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 06:** ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇవ్వడం లేదని, అందువల్ల సంతృప్తి శాతం తగ్గుతోందన్నారు. ఎండార్స్మెంట్ స్పష్టంగా ఉండాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చాలా మంది అధికారులు గడువు ముగిసే చివరి నిమిషంలో (ఉదాహరణకు 100 రోజులు సమయం ఉంటే 90వ రోజున) దరఖాస్తులను చూసి హడావుడిగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇలా చేయకూడదని, ఫిర్యాదు అందిన మొదటి రోజే దానిని పరిశీలించి, పరిష్కారానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పిటిషనర్ ఫిర్యాదు అందిన వెంటనే వారితో మాట్లాడాలన్నారు. ఒక సర్వేయర్ 5 మంది పిటిషనర్ల కు సంబంధించి సర్వే చేసినప్పటికీ, సర్వే సర్టిఫికేట్ ఇవ్వనందున అతని ఇంక్రిమెంట్లు కట్ చేయడం జరిగిందన్నారు. పనిలో నిర్లక్ష్యం వహిస్తే ఎవరిపైనైనా కఠిన చర్యలు ఉంటాయన్నారు. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ పూర్తిగా శాతాన్ని తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# టిబి ముక్త పంచాయతీ సర్టిఫికెట్ ప్రధాన ఉత్సవం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 6:** జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నంద్యాల కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మీటింగ్ హాలు నందు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆఫీసర్స్ సమక్షంలో డాక్టర్ ఆర్ వెంకటరమణ డిఎంహెచ్ఓ మరియు డిస్ట్రిక్ట్ లేప్రోసి ఎయిడ్స్ అండ్ టిబి ఆఫీసర్ డాక్టర్ శారదాబాయి అధ్యక్షతన 2025, 26 సంవత్సరమునకు గాను 23 గ్రామపంచాయతీలను టీవీ ముక్తా పంచాయతీలుగా ఎంపిక చేయడం జరిగింది. ఈ విధంగా ఎంపిక కాబడినటువంటి పంచాయతీలకు టిబి ముక్త పంచాయతి సర్టిఫికెట్ మరియు మహాత్మా గాంధీ ప్రతిమను ఇవ్వడం జరిగింది.

# ఎద్దుల బండ లాగుడు పోటీలను ప్రారంభించిన తాటికొండ బుగ్గరాముడు.









**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు ఏప్రిల్ 06:**
బండిఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామం నందు ఈస్టర్ పండుగ సందర్భంగా నిర్వహించిన ఎద్దులు బండ లాగుడు పోటీలను ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు,నంద్యాల 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ ఎద్దుల జట్టు యజమానులకు అభినందనలు తెలియచేస్తూ రిబ్బన్ కట్ చేసి ఈ పోటీలను ప్రారంభించడం జరిగింది అని ఆయన అన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి ఆయనను సగౌరవంగా ఆహ్వానించినదుకు కడమల కాల్వ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టానికులు భూపాల్, ఎద్దుల సుబ్బరాయుడు, పబ్బతి రాజేష్,పబ్బతి మోహన్,కొప్పుల భాస్కర్,పబ్బతి రంగస్వామి, వెంకటయ్య తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరోగ్యం పై నిరంతరం అవగాహణ అవసరం.

## సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ ఏప్రిల్ 06:**
ప్రస్తుత ఆధునిక యుగం లో ఆరోగ్యం పై ప్రజల్లో నిరంతరం అవగాహణ అవసరమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలియజేశారు.ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు .ఎంత ఐశ్వర్యము ఉన్న ఆరోగ్యం లేకపోతే జీవితం చాలా కష్టం అవుతుంది .మనిషి నిజమైన సంపద ఆరోగ్యమే. ఆరోగ్యంగా ఉంటే ఆనందమే కాదు మనిషి సాధించలేనిది ఏమీ లేదన్న సంగతి గుర్తుంచుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.అందుకే ఈ ఉరుకులు పరుగుల జీవితంలో సంపదకే కాదు ఆరోగ్యంగా ఉండటానికి సమయం ఇవ్వాలి. ఆరోగ్యం అనేది మనకున్న సంపదలో అతి పెద్ద సంపద అని భావించాలి. మనకు కాళ్ళు చేతులు పనిచేసెవరకు సంపాదనే ధ్యేయంగా జీవిస్తున్నాం. ఆ తర్వాత వ్యాధులు వచ్చాకా ఆరోగ్యాన్ని బాగు చేయించడానికి ఖర్చు చేస్తాం. మన పని మనం చేసుకోవడానికి అయినా ఆరోగ్యం అవసరం. డబ్బు సంపాదనకైన తీర్థయాత్రలకు వెళ్ళాలన్న ఆరోగ్యం కావాలి.నిజ జీవితం లో చాలా ముఖ్యమైన ఆరోగ్యాన్ని అశ్రద్ద చేస్తున్నాము.కాబట్టి మనం ఆరోగ్యాన్ని అశ్రద్ద చెయ్యకుండా ముందుగానే శారీరక మానశిక ఆరోగ్యం పై శ్రద్ద వహించండి .యోగ వ్యాయామాలు ధ్యానం చేస్తూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి. కలుషితం లేని మంచి నీరు, నిద్ర ,మంచి ఆహారం తీసుకోవాలి. మంచి ఫ్యామిలి డాక్టర్ ను ఎంచుకోండి మాటి మాటికి వైద్యులను మార్చకండి. మీతత్వం తెలిసిన మీ కుటుంబ వైద్యుని సంరక్షణ లో ఆరోగ్యాన్ని కాపాడుకోండి. మన ఇంటి చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి .అప్పుడే మనం వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటాము. ఎక్కువగా ఆలోచనలు చేసి మానశిక స్థైర్యం కోల్పోకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

# సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు




**అనంతపురం ఆంధ్ర ప్రగతిఏప్రిల్ 06:**
సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు సుస్థిర అభివృద్ధి ముందుకు తీసుకెళ్లగా బలమైన సామర్థ్యం మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. సోమవారం అనంతపురం జేఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన 15వ స్నాతకోత్సవా నికి గవర్నర్ ఛాన్సర్ హోదాలో, ముఖ్య అతిథిగా హాజరై వేడుకలకు శోభను చేకూర్చారు. అంతకుముందు జేఎన్టీయూ అతిథి గృహం వద్ద గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గౌరవ గవర్నర్ కు జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ మధు మూర్తి, వైస్ ఛాన్సర్ సుదర్శన్ రావు, రిజిస్టారర్ కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డా. నాగప్రసాద్ నాయుడు తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉపకులపతి హెచ్. సుదర్శన్ రావు అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

# నంద్యాలలో మాజీ సైనిక ఉద్యోగి ప్రసాద్ రావుకు అన్యాయం.

**తనకు కేటాయించిన భూమిని ఇతరులకు ఆన్లైన్ చేసిన రెవెన్యూ అధికారులు.**

**తన పొలం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన న్యాయం జరగడం లేదని ఆవేదన.**

**వరప్రసాద్ కు న్యాయం జరిగే వరకూ అసోసియేషన్ తరపున పోరాటం చేస్తాం.**

**నంద్యాల మాజీ సైనిక అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగనాయకులు.**

**ఆంధ్ర ప్రగతి(నంద్యాల ఏప్రిల్ 06:**
నంద్యాల పట్టణంలోని నూనెపల్లి సమీపంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగస్తుల కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ ఎస్ పి వరప్రసాద్ రావు (ఎక్స్ ఆర్మీ) నేను ఇండియన్ ఆర్మీ యందు 17 సంవత్సరాలు పనిచేసే కార్గిల్ యుద్ధంలో పాల్గొని 2001 సంవత్సరం జులై నెల పదవి విరమణ చేశాను, అప్పటి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ వారు 2002 సంవత్సరం జిసి పాలెం సర్వేనెంబర్ 328 /2 యందు 3-50 సెంట్లు భూమిని నాకు కేటాయించారు.వివరాల్లోకి వెళితే : ఈ ఎస్ పి ప్రసాద్ రావు రిటైర్డ్ ఆర్మీ 17 సంవత్సరాలుగా ఆర్మీలో పనిచేసి



కార్గిల్ యుద్ధంలో కీలక పాత్ర పోషించిన ఆర్మీ జవాన్ కు, అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2002 సంవత్సరంలో బండి ఆత్మకూరు మండలం జిసి పాలెం గ్రామంలో సర్వేనెంబర్ 328 /2 లో3- 50 సెంట్లు భూమిని ఆర్మీ జవాన్ కు కేటాయించారు.
బండి ఆత్మకూర్ మండల అప్పటి ఎమ్మార్వో జి జోషి బాబు తేదీన 02/02 /2002 సంవత్సరంలో టెంపరరీ పొజిషన్ పట్టాను ఈఎస్పి వరప్రసాద్ కి కేటాయించారు. ప్రతి సంవత్సరం పట్టాను రెన్యువల్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రసాద్ రావు నాలుగు సంవత్సరాలుగా రెన్యువల్ చేయించుకున్నారు తర్వాత అవసరం లేదు అని రెవిన్యూ అధికారులు తెలిపారు,అనంతరం ప్రసాదరావు అనారోగ్యం కారణంగా కొద్ది రోజులు పొలాన్ని సాగు చేసుకోలేకపోయారు అనంతరం ప్రసాదరావు తన పొలాన్ని సాగు చేసుకోవడానికి పొలం వైపు వెళ్ళగా పెద్దినేని మురళి మోహన్ ｓ/ｏ శ్రీ తండ్రి సిద్దయ్య పేరుమీద ఆన్లైన్లో ప్రసాద్ రావు పొలాన్ని ఎక్కించుకున్నారు.
ఆ క్రమంలో ప్రసాదరావు ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగారు ఇది గమనించిన మురళీమోహన్ గోదా పెద్ద మదిలేటికి ఆ పొలాన్ని విక్రయం చేసి వెళ్లిపోయారు,ప్రసాద్ రావు.ఆర్మీ జవాన్ వరప్రసాద్ రావు పలుమార్లు పి జి ఆర్ ఎస్ లో జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు జిల్లా ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందిస్తున్నారు కానీ కిందిస్థాయి ఉద్యోగ సిబ్బందులు స్పందించకపోవడం చాలా బాధాకరమైన విషయం,ఈ ఎస్పీ వరప్రసాదరావు జిల్లా ఉన్నతాధికారి కలెక్టర్ కు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రివర్యులకు, అందరికీ తమ గోడును చెప్పుకున్న వరప్రసాద్ రావు నంద్యాల జిల్లాలోని సంబంధించిన అధికారులకు న్యాయం చేయాలని వారు తెలిపారు,దేశం కోసం వారు ప్రాణాలను తెగించి ప్రజల కోసం పోరాడుతుంటే, రిటైర్డ్ జవాన్ల భూములకు కబ్జా చేస్తున్న కనికరించని రెవెన్యూ అధికారులు, ప్రసాద్ రావు కుటుంబాన్ని జిల్లా ఉన్నతాధికారులు కాపాడాలని కోరుకుంటున్న రిటైర్డ్ ఆర్మీ జవాన్ల సంఘం అధ్యక్షులు రంగనాయకులు
తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూ ఉంటామని తెలిపారు

# కిండర్ గార్డెన్ స్నాతకోత్సవ వేడుకలు.










**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 06:**
నంద్యాల పట్టణం
సంజీవనగర్ శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ పాఠశాల 'కిండర్ గార్డెన్ స్నాతకోత్సవ' వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను శ్రీ సంకల్ప్ మరియు శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, కరస్పాండెంట్ రమ్యారెడ్డి ప్రిన్సిపాల్ , జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ వేడుకలలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమదైన శైలిలో ప్రదర్శనలిచ్చారు.ఈ సందర్భంగా శ్రీ సంకల్ప్ మరియు శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత శ్రీ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ప్రీస్కూల్ అనేది అత్యంత కీలకమైన అభ్యాస దశ అని,పాఠశాల ప్రైమరీ స్థాయిలో నిర్వహించే ఈ స్నాతకోత్సవ వేడుకలు ఎదిగే విద్యార్థుల జీవితాలలో చిరస్థాయిగా ఉంటాయన్నారు.ఈ వేడుక ప్రీ ప్రైమరీ మరియు ప్రైమరీ విద్యార్థులకు తమ విద్యాభ్యాస సమయంలో ఒక మైలురాయి వంటిదని,ఇది వారిలో ఉత్సాహాన్ని అందించడమే గాక,ఆత్మవిశ్వాసాన్ని తదుపరి తరగతులకు వెళ్లాలనే ఆసక్తిని పెంచుతాయన్నారు చిన్నతనంలోనే తమ లక్ష్యాన్ని సాధించామన్న భావన పిల్లల్లో కలుగుతుందన్నారు. సర్టిఫికెట్లు మరియు ఫోటోలతో కూడిన సన్నివేశాలు పిల్లల మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయన్నారు.అలాగే తల్లిదండ్రుల్లో కూడా తమ పిల్లలను ఆ దుస్తులలో చూడటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని,తమ పిల్లల ఎదుగుదల తీరును చూసి మురిసిపోయే సందర్భమని వివరించారు విద్యార్థులు వేదిక మీద నిలబడడం వలన వారిలో భయాందోళనలు తొలగిపోతాయని, ఆటపాటలతో సాగిపోయే వారి జీవితంలో ఒక ఉత్తేజకరమైన గుర్తింపుగా మిగిలిపోయే సన్నివేశాలు ఈ స్నాతకోత్సవ వేడుకలు అని







వివరించారు. ఇందులో భాగంగా స్నాతకోత్సవ దుస్తులలో ఉన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు విచిత్ర వేషధారణలతో అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. విద్యార్థుల ప్రదర్శనలు విచ్చేసిన ప్రేక్షకులను అబ్బురపరిచాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి.

**ప్రముఖ విభాగాల్లో వైద్య సిబ్బందిని పెంచండి.**

**ఆసుపత్రిలో పారిశుద్యానికి అత్యంత ప్రాధాన్యత.**

**వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా వసతులు ఏర్పాటు చేయాలి.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 06:**
ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఛాంబర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన మెరుగల వైద్య సేవలు అందించేందుకు పరికరాలు సంబంధిత అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.జిలానీ, డిసిహెచ్ఎస్ డా.ఓ.లలితా, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీర్లు నరసింహారెడ్డి జయరాంరెడ్డి, ఎడి మస్తాన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న మొత్తం 84 ఎయిర్ కండీషనర్లలో 29 పనిచేయకపోవడం గమనించిన కలెక్టర్, వాటిలో మరమ్మతులకు అనువైనవి ఎన్ని, కొత్తగా అవసరమయ్యేవి ఎన్ని అన్నదానిపై తక్షణ అంచనా వేయాలని ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, పాథాలజీ మరియు మైక్రోబయాలజీ ల్యాబ్లలో ఏసీలు సమర్థంగా పనిచేయడం అత్యవసరమని పేర్కొంటూ, ఈ విభాగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏసీలు తరచూ పాడవ్వడానికి ప్రధాన కారణంగా తలుపుల లోపాలు ఉన్నాయని గుర్తించి, డోర్ క్లోజర్లు ఏర్పాటు చేయాలని, అల్యూమినియం డోర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. అలాగే, ఏసీల వినియోగంపై అవగాహన కల్పించేందుకు 24 డిగ్రీల వద్ద ఉంచాలనే సూచనలతో స్టిక్కర్లు ప్రతిచోటా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తక్కువ ఉష్ణోగ్రతల వద్ద వినియోగం యంత్రాలపై భారం పెంచుతుందని హెచ్చరించారు. అవసరాన్ని బట్టి షిఫ్టుల వారీగా ఏసీల వినియోగాన్ని అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఎయిర్ కంప్రెషర్లు మరియు వ్యాక్యూమ్ సిస్టమ్స్ సరిగా పనిచేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఐసీయూ రోగులకు ఇది ఇబ్బందికరమని చెప్పి, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి వచ్చే సోమవారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. డయాలసిస్ యూనిట్ (నెఫ్రోప్లస్) భాగంగా, 14 బెడ్లతో రోజుకు 40-45 డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ఒప్పంద నిబంధనల ప్రకారం అవసరమైన నలుగురు శిక్షణ పొందిన వైద్యుల స్థానంలో కేవలం ఇద్దరు మాత్రమే ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం, ఆయుర్వేద వైద్యులను నియమించడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే అర్హత కలిగిన నిపుణులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. డయాలసిస్ సేవలు ఉ.6.గం.ల నుంచి రా.12 గం.ల వరకు కొనసాగుతున్న నేపథ్యంలో, అత్యవసర పరిస్థితుల్లో రాత్రి కూడా కనీసం ఒక బెడ్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి మూడు యంత్రాలకు ఒక టెక్నీషియన్ ఉండేలా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. వైద్య పరికరాల విషయంలో థైరాయిడ్ పరీక్షలకు అవసరమైన సదుపాయాలు, రిఫ్రిజిరేటెడ్ సెంట్రిఫ్యూజ్ వంటి పరికరాల లభ్యతపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంకేతిక పర్యవేక్షణకు అర్హత కలిగిన సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలని సూచించారు.
సెక్యూరిటీ సిబ్బంది కొరతపై కూడా కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల ప్రకారం 67 మంది ఉండాల్సిన చోట ప్రస్తుతం 49 మంది మాత్రమే ఉండటంతో మిగిలిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. సిబ్బంది వయస్సు, ఆరోగ్యం, హాజరు వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆసుపత్రి భద్రత, మౌలిక వసతుల పరంగా ఫైర్ ఆడిట్, బ్లడ్ బ్యాంక్ ఆడిట్, ఎలక్ట్రిసిటీ మరియు మెడికల్ ఆక్సిజన్ ఆడిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశాలపై స్పందించని విభాగాలకు వెంటనే లేఖలు పంపి, తదుపరి సమీక్షకు హాజరు కావాలని సూచించారు. భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, పాత నీటి ట్యాంక్ ప్రమాద స్థితి వంటి అంశాలపై కూడా చర్చించి, తాత్కాలికంగా నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని, శాశ్వత పరిష్కారం కోసం కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రేడియాలజీ విభాగంలో ఎక్స్రే యూనిట్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆసుపత్రి సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సంబంధిత విభాగాధిపతులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు.